


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

ప్రకాశం
బాపట్ల

శనివారం | 3 మే 2025



# జయహో.. అమరావతి

## అమరావతి పున:ప్రారంభోత్సవ వేడుకలో ఉమ్మడి ప్రకాశం ప్రజాప్రతినిధులు
## సందడి చేసిన మంత్రులు గొట్టిపాటి, స్వామి, ఎంపి మాగుంట, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు, కూటమి నేతలు

ఒంగోలు, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి పునఃప్రారంభోత్సవ సభకు ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజాప్రతినిధులు తరలివెళ్లారు. ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపుతో జిల్లా మంత్రులు, శాసన సభ్యులు, ఇన్‌చార్జ్‌లు సారథ్యంలో ఆయా నియోజకవర్గాల టిడిపి, జనసేన, బిజేపి శ్రేణులు భారీగా వెళ్లారు. సహచర మంత్రులు, ఎంపిలు, శాసన సభ్యులతో మన జిల్లా నేతలు సందడి చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్, సంతనూతలపాడు శాసన సభ్యులు బీఎన్ విజయకుమార్, కందుకూరు శాసన సభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు, చీరాల శాసన సభ్యులు ఎంఎం కొండయ్య, కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, గిద్దలూరు శాసన సభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి, మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి, పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు, రాష్ట్ర పర్యాటక సంస్థ ఛైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, దర్శి ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, యర్రగొండపాలెం ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు, ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన అధ్యక్షులు షేక్ రియాజ్, బిజేపి జిల్లా అధ్యక్షులు శెగ్గం శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు కల్యాణ్ చక్రవర్తితో పాటు కూటమి ముఖ్యనేతలు అన్ని నియోజకవర్గాల నుండి నాయకులు, మహిళలు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.







# దారులన్నీ.. అమరావతి వైపు




- అమరావతి పునఃప్రారంభ వేడుకకు కూటమి సైన్యం
- ఒంగోలు నుంచి అత్యధిక సంఖ్యలో సభకు వెళ్లిన టిడిపి శ్రేణులు
- జెండా ఊపి బస్సులను ప్రారంభించిన ఎంపి మాగుంట, ఎమ్మెల్యేలు దామచర్ల, బిఎన్



ఒంగోలు, మేజర్‌న్యూస్ : అమరావతి పునఃప్రారంభ సభకు ఒంగోలు నియోజక వర్గం నుంచి కూటమి శ్రేణులు అత్యధిక సంఖ్యలో తరలివెళ్లారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, మహిళలు, జనసేన, బిజేపి శ్రేణులు ఒంగోలు నుండి వెళ్తున్న బస్సులకు ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్, సంతనూతలపాడు శాసన సభ్యులు బిఎన్ విజయ కుమార్, మేయర్ గంగాడ సుజాతలు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ అమరావతి చరిత్రలో నేడు నవ శకానికి నాంది, కూటమి పాలనలో ఆంధ్రుల కలల రాజధాని మళ్లీ జీవం పోసుకొంటుంది, దేశానికే తలమానికంగా అమరావతి అభివృద్ధి చెందబోతుందని తెలిపారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అద్భుతమైన అమరావతి అవతరించనుందని అన్నారు. ప్రజా రాజధాని అమరావతి పునఃప్రారంభ వేడుకకు ఒంగోలు నుంచి వెళ్తున్న వారికి అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.







## అమరావతికి తరలిన మాజీ ఎమెల్యే పాపారావు

దర్శి, మేజర్‌న్యూస్: ప్రజా రాజధాని అమరావతికి మాజీ ఎమెల్యే నారపుశెట్టి పాపారావు, నాయకులు తరలివెళ్లారు. ఆంధ్రుల కలలు రాజధాని అమరావతి పనులు పునః ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాజీ ఎమెల్యే పాపారావు వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు అంబటి గోవిందరెడ్డి, మల్లిఖార్జున రావు, అంబటి వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు కసినపల్లిలో ఉచిత వైద్య శిబిరం



కొమరోలు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని చింతలపల్లి గ్రామపంచాయతీ కసినపల్లె గ్రామంలో కాకినాడ ఎస్‌బిసి సహకారంతో స్థానిక ఫ్రెండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు బిజ్జం చిన్న నరసయ్య శుక్రవారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడలోని ఎస్‌బిసి సహకారంతో ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో నెల్లూరుకు చెందిన బిఎస్ఆర్ జనరల్ హాస్పిటల్‌కి చెందిన డాక్టర్ కమలేశ్వర్, హైదరాబాద్ యశోద హాస్పిటల్‌కి చెందిన డాక్టర్ జోష్ణ, డాక్టర్ బి.సలోమి వైద్య నిపుణులతో అన్ని రకాల జనరల్ కేసులకు పరీక్షలు నిర్వహించి, శస్త్ర చికిత్సలు అవసరమైన వాళ్లకు సిఫారసు చేసి, మిగిలిన వాళ్లకు మందులు పంపిణీ చేయడం జరుగుతుందని తెలియజేశారు. మండల పరిసర ప్రాంతంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ సభ్యులు తెలియజేశారు.



## అమరావతి బయలుదేరిన తెలుగు తమ్ముళ్లు

హనుమంతునిపాడు, మేజర్‌న్యూస్: స్థానిక మండల పరిధిలోని 23 పంచాయతీల నుంచి కనిగిరి గౌరవ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశానుసారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సానికోమ్ము తిరుపతిరెడ్డి వారి ఆధ్వర్యంలో హనుమంతునిపాడు మండలం నుండి గౌరవ భారత దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్, అమరావతి పునర్నిర్మాణ సభకు వస్తున్న సందర్భంగా జండా ఊపి బస్సులలో కార్యకర్తలను అమరావతి తరలించటం జరిగినది. ఈ కార్యక్రమంలో 23 గ్రామపంచాయతీల తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు పాల్గొని అమరావతి బయలుదేరి వెళ్లడం జరిగినది.

## ఒకటో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి: ఎంఈఓ



జరుగుమల్లి, మేజర్‌న్యూస్: బాలల ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం ప్రకారం 2025-26 విద్యా సంవత్సరంలో ఒకటవ తరగతి ప్రవేశానికి ఈనెల రెండవ తేదీ నుంచి ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకునేందుకు ప్రభుత్వ అవకాశం కల్పించిందని మండల విద్యాశాఖ అధికారి బి.నాగేంద్రవదన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలో ఒకటవ తరగతిలో పేదలు అనాధలు దివ్యాంగులు ఆర్థికంగా సామాజికంగా వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థుల 25 శాతం సీట్లు కేటాయించిన అంటూ ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ మండలంలో మొత్తం రెండు ప్రైవేటు పాఠశాలలు ఉన్నట్టు ఆయన తెలిపారు. ఈ పాఠశాలలో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తులు ఆన్లైన్లో స్వీకరిస్తారన్నారు. ఈ నెల 19వ తేదీన లోపు ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని గ్రామ వార్డు సచివాలయంలో నెట్ సెంటర్ లో మీసేవ సెంటర్లో స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

# కనిగిరిలో ఉరుములు మెరుపులతో భారీ వర్షం

### పిడుగుపాటుకు 20 మేకలు మృత్యువాత

కనిగిరి, మేజర్‌న్యూస్: పట్టణంలో శుక్రవారం తెల్లవారుజామున ఈదురు గాలులు, ఉరుములు ,మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. పట్టణంలోని కాశిరెడ్డికాలనీ, శివనగర్‌కాలనీ, బోయపాలెం లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రైనేజి కాలువలు, వంకలు పొంగి ప్రవహించాయి. ఒంగోలు బస్టాండ్‌లో ఎగువ ప్రాంతాల నుంచి వర్షం నీరు ఉధృతి ఎక్కువ కావడంతో రహదారిపై వర్షపు నీరు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

**పిడుగు పడి 20 మేకలు మృతి**

మండలంలోని పోలవరం పంచాయతీలోని నిమ్మమహేశ్వరపురం గ్రామంలో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. గ్రామంలో పిడుగు పడి నూకతోటి శివపార్వతికి చెందిన 20 మేకలు మృతి చెందాయి. సుమారు 4 లక్షల మేర నష్టం వాటిల్లింది. కుటుంబానికి ఆర్థికంగా చేయూతగా ఉన్న మేకలు చనిపోవడంతో తమకు బ్రతుకు దెరువు లేకుండా పోయిందని భోరున విలపించింది. నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది .పిడుగు పాటుకు మేకలు చనిపోయాయని విషం తెలుసుకున్న జడ్పిటీసి మడతల కస్తూరిరెడ్డి ,సిపియం నాయకులు పివి శేషయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. చనిపోయిన మేకలకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

**నేలకూలిన చెట్టు**

శుక్రవారం ఉదయం ఈదురు గాలులతో కూడిన వర్షానికి మండలంలోని బల్లిపల్లి పంచాయతీలోని అడ్డరోడ్డు గ్రామం వంగపాడు వెళ్లే రహదారిలో చెట్టు నేలకూలింది. దీంతో ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడి రాకపోకలు నిలిచి పోయాయాయి. అధికారులు ఎవ్వరూ పట్టించుకోలేదు. స్థానిక టీడీపీ నాయకుడు పోలంరెడ్డి బాలకృష్ణ చొరవ తీసుకొని మధ్యాహ్నం చెట్టును రహదారి పైనుండి తొలగించారు. రాకపోకలు యధావిధిగా కొనసాగాయి.







# ఏపికి పది రెట్లు ఎక్కువ నిధుల కేటాయింపు : ప్రధాని మోదీ

### వికసిత్ భారత్‌కు ఏపి గ్రోత్ ఇంజిన్‌గా మారాలని పిలుపు

**సూర్యప్రతినిధి, ఒంగోలు**

వెలగపూడిలో జరిగిన అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపన సభలో ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రానికి కేంద్రం అందిస్తున్న మద్దతుపై విపులంగా మాట్లాడారు. ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రైల్వే ప్రాజెక్టులకు కలిపి కేవలం 900 కోట్ల రూపాయలలోపే నిధులు కేటాయించేవారని గుర్తు చేసిన మోదీ, ప్రస్తుతం కేవలం ఏపీకి మాత్రమే రూ. 9,000 కోట్లకు పైగా నిధులు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇది గతంతో పోలిస్తే పది రెట్లు ఎక్కువ నిధుల కేటాయింపు అని తెలిపారు. ప్రధాని వివరించిన మేరకు, గత పదేళ్లలో ఏపీలో 750 రైల్వే బ్రిడ్జిలు, అండర్‌పాస్‌లు నిర్మించబడ్డాయి. వందేభారత్ రైళ్లు, అమృత్ భారత్ రైళ్లు కేటాయించడంతో పాటు, 70కి పైగా రైల్వే స్టేషన్లు అభివృద్ధి పనిలో ఉన్నాయని చెప్పారు. ప్రాజెక్టుల వల్ల సిమెంట్, స్టీల్, రవాణా రంగాలు అభివృద్ధి చెందుతాయనీ, ముఖ్యంగా వేలాదిమంది యువతకు ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పన ద్వారా ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని ప్రధాని అభిప్రాయపడ్డారు. రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి కూడా మోదీ వివరించారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతులకు మద్దతు అందిస్తున్నట్లు తెలియజేశారు. అలాగే పథకాలు, పరిహారం కింద ఇప్పటికే రూ. 17,000 కోట్లకు పైగా సహాయం అందించామన్నారు. వికసిత్ భారత్ నిర్మాణానికి పేదలు, యువత, మహిళలు, కార్మికులు కీలక స్తంభాలుగా మోదీ అభివర్ణించారు. ఈ నాలుగు వర్గాల అభివృద్ధే దేశాన్ని ముందుకు నడిపించే శక్తి అని, వీరిని బలోపేతం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

అమరావతి పునర్ నిర్మాణ పనులకు వెలగపూడిలో శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. సభా వేదిక పైనుంచే 18 ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపనలు చేశారు ప్రధాని మోదీ. రాజధాని పనులు సహా రూ.58 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. అయితే.. ఈ సందర్భంగా ప్రధాని మోదీ సభలో మాట్లాడుతూ.. 2015లో అమరావతికి ప్రజా రాజధానిగా శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. గత పదేళ్లుగా అమరావతి అభివృద్ధికి కేంద్రం అన్నిరకాల మద్దతు అందించిందని తెలిపారు. సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు సహా అన్ని నిర్మాణాలకు కేంద్ర సహకారం అందిస్తోందని వివరించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ కలలను సాకారం చేయాల్సిన అవసరాన్ని మోదీ ప్రస్తావించారు. “వికసిత్ భారత్‌కు ఏపీ గ్రోత్ ఇంజిన్‌గా మారాలి. మనందరం కలిసి పనిచేస్తే అది సాధ్యమవుతుంది,” అని ఆయన స్పష్టం చేశారు. పవన్ కళ్యాణ్ పేరుని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, “ఇది మనం చేయాలి.. మనమే చేయాలి” అని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రైలు, రోడ్డు ప్రాజెక్టుల అభివృద్ధికి కేంద్రం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని ప్రధాని తెలిపారు. భారతదేశం ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా నిలిచిందని, దీనికి ఆంధ్రప్రదేశ్ కీలక భూమిక పోషించనుందని ఆయన స్పష్టం చేశారు.

అమరావతి పునః ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఘన స్వాగతం పలికారు. సభా వేదికపైకి వచ్చిన ప్రధానికి అమరావతి రైతులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. “అమరావతికి నేనున్నాను” అనే సందేశాన్ని ప్రధాని మోదీ ఇచ్చిన సందర్భాన్ని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ సందర్భంగా వేదికపై మాట్లాడిన పవన్ కళ్యాణ్, ప్రధాని మోదీకి సంబంధించిన ఓ ఆసక్తికర విషయం పంచుకున్నారు. “ప్రధాని నరేంద్ర మోదీ ఓం సన్యాశాశ్రమంలో ఉన్నప్పుడు ఆయనకు ‘అనికేత్’ అనే పేరు పెట్టారు. అనికేత్ అంటే ఇంటి లేని వాడు, పరమశివుడి పేరులోని తత్త్వం. ఈరోజు ఇల్లు, కుటుంబం లేని మోడీగారు%ొ% 140 కోట్ల భారతీయులను తన కుటుంబంగా భావిస్తూ దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు” అని పవన్ అన్నారు. అదే సమయంలో, అమరావతి రైతులు, ఆడపడుచుల తరపున ప్రధాని మోదీకి పవన్ కళ్యాణ్ హృదయపూర్వక నమస్కారాలు తెలిపారు.

**ONGOLE MUNICIPAL CORPORATION**

E-Procurement Tender Notice No. 135/2025-26, Dt. 02-05-2025

| | | | |
|---|---|---|---|
| | | | 135/2025-26 |
| 1. | Number of Works | : | 1 |
| 2. | Total value of works | : | Rs. 10.00 Lakhs |
| 3. | Download Start Time | : | 02.05.2025 @ 4.00 PM |
| 4. | Download End Time | : | 05.05.2025 @ 4.00 PM |

For Details “www.apeprocurement.gov.in, Ph : 98499 06599

Executive Engineer,
Ongole Municipal Corporation.

సూర్య
www.suryaa.com
PRAKASAM ప్రకాశం BAPATLA బాపట్ల



## ఘనంగా కాళకమ్మ వీరభద్రస్వామి తిరునాళ్ళ ప్రారంభం

కర్లపాలెం, మేజర్‌న్యూస్: కర్లపాలెం ఐలాండ్ సెంటర్లలోని కాళకమ్మ వీరభద్రస్వామి ఆలయ 17 వ వార్షిక తిరునాళ్ళ వేడుకలు ఘనంగా ప్రారంభం అయ్యాయి.ఈ సందర్భంగా జలబిందెలు,పసుపు బండ్ల ఊరేగింపు నిర్వహించారు.డప్పు వాయిద్యాలతో ఐలాండ్ సెంటర్ నుంచి లంక చానెల్ వరకు మహిళా భక్తులు వెళ్లి బిందెలతో నీళ్లు తీసుకొచ్చి కాళకమ్మ వీరభద్రస్వాములకు అభిషేకాలు నిర్వహించారు.సాయంత్రం పసుపు బండ్లు ఊరేగింపు నిర్వహించారు ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కుంచాల సాంబిరెడ్డి,కట్టా సుజాత,వెంకటేశ్వరరెడ్డి, రామరాజు తదితరులు పాల్గొన్నారు

## బురకాయలంకమ్మ తల్లి కొలుపులు





కర్లపాలెం, మేజర్‌న్యూస్: బురకాయలంకమ్మ అమ్మవారి ఆశీస్సులు గ్రామస్తులందరిపై ఉండాలని గ్రామ పెద్దలు అన్నారు. కర్లపాలెం మండలం పాతనందాయపాలెం గ్రామంలో వేంచేసియున్న బురకాయలంకమ్మ తల్లి కొలుపులను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మాత మైలు ,కల్యాణం నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మని దర్శించుకు న్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రావి గోవిందరెడ్డి, పెద్ద శ్రీనివాసరెడ్డి, భవన్నారాయణ రెడ్డి,చిన్న శ్రీనివా సరెడ్డి, నరసారెడ్డి, సుభాష్ రెడ్డి,గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని సభకు బయలుదేరిన ప్రజలు



నగరం, మేజర్‌న్యూస్: అమరావతిలో ఏర్పాటు చేసిన దేశ ప్రధాని నరేంద్రమోదీ హాజరయ్యే సభకు స్థానిక మండల పరిధిలోని 17 గ్రామ సచివాలయాల నుంచి 15 బస్సుల్లో సుమారు 900 పైచిలుకు బయలుదేరి వెళ్ళారు. శుక్రవారం ఉదయం మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద బస్సులను అధికారులు, ఆయా పార్టీల నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి. శ్రీనివాసరావు, ఏరియ కోఆర్డినేటర్ రమాదేవి, టీడీపీ మండల అధ్యక్షుడు చింతల సుబ్బారావు, ఆయా శాఖల అధికారులు, సచివాలయ, మెడికల్, పోలీసు, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది, ఆశా వర్కర్లు, మహిళా పోలీసులు, డ్వాక్రా సంఘాల సభ్యులు తదితరులున్నారు.

## తేజకు రెండో ర్యాంక్



ముండ్లమూరు, మేజర్‌న్యూస్: ఆరో తరగతి మోడల్ స్కూల్ ఎంట్రన్స్ టెస్ట్‌లో 76 మర్కులతో మండలంలో 2వ ర్యాంక్‌ను పోలవరం న్యూ స్కూల్ విద్యార్థి అశ్వబ్రహ్మ తేజకు సాధించారాని హెచ్ యం పి.శ్రీనివాసరావు తెలిపారు. ఆ విద్యార్థిని ఉపాధ్యా యులతోపాటు, గ్రామస్తులు తల్లిదండ్రులు అభినందించారు.





# ఉత్తమ నాటకంగా ఎంపికైన 'ఇది అతని సంతకం'

భట్టిప్రోలు,మేజర్‌న్యూస్: మండలంలోని పల్లెకోన గ్రామంలో పరుచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరుచూరి రఘుబాబు స్మారక 35వ జాతీయ(2025) నాటకోత్సవాలు ఏప్రిల్ నెల 27వ తేదీ నుండి మే 1వ తేదీ వరకు నిర్వహించారు. ఇందులో నాటక విభాగంలో ఉత్తమ ప్రదర్శనగా"ఇది అతని సంతకం"నాటకం ప్రథమ బహుమతిని సాధించింది.ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా "అన్నదాత"ఉత్తమ దర్శకత్వం ఇది అతని సంతకం నాటకానికి లభించింది.ఉత్తమ రచన,ఉత్తమ నటుడు ఇది అతని సంతకం నాటకానికి లభించగా ఉత్తమ నటి 27వ మైలురాయి లో నటించిన వైదేహి పాత్రధారి సురభి ప్రభావతికి లభించింది. ఉత్తమ ప్రతినాయకుడిగా అన్నదాత నాటకంలో మేస్త్రి పాత్రధారి కొల్లా రాధాకృష్ణ దక్కించుకున్నారు. ఉత్తమ క్యారెక్టర్ యాక్టర్ గా అన్నదాత నాటకంలోని రాఘవయ్య పాత్రధారి భుజంగరావును వరించింది.ఉత్తమ సహాయనటుని 27వ మైలురాయిలో నటించిన పవన్ కుమార్ కు లభించింది.ఉత్తమ హాస్యానటునిగ అన్నదాత లో బుచ్చియ్య పాత్ర దారి తిరుమలకు లబించిది.ఉత్తమ ఆహార్యం





హరిలో రంగ హరి లోని సురభి రాఘవకు దక్కింది.ఉత్తమ సంగీతం ఇది అతని సంతకం లోని లీలా మోహన్ కు, ఉత్తమ రంగాలంకరణ కు హరిలోరంగ హరి నాటకానికి,ప్రత్యేక బహుమతి మంత్రనగరి లోని నవీన్ పాత్రధారి అనిల్ కుమార్ కు,మరో ప్రత్యేక బహుమతి 27వ మైలురాయిలోని సూరిగాడు పాత్రధారి ఆర్ వాసు కు లభించాయి.

**నాటికలు విభాగంలో...**

ఉత్తమ నాటికగ మహాప్రస్థానం, ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా జనరల్ బోగీలు,ఉత్తమ దర్శకత్వం మహాప్రస్థానం, ఉత్తమ రచన జనరల్ బోగీలు,ఉత్తమ నటుడు జనరల్ బోగీలోని గోకరాజు విజయ్, ఉత్తమ నటి జనరల్ బోగీలోని సురభి ప్రభావతి,ఉత్తమ ప్రతినాయకుడిగా చిగురు మేఘంలోని కే సరిత,ఉత్తమ సహాయ నటి చిరుమేఘం లోని నరసమ్మ పాత్రధారి బి నాగ రాణి,ఉత్తమ సహాయ నటుడిగా మహాప్ర స్థానంలోని సింహాద్రి పాత్రధారి బి నరేష్, ఉత్తమ హాస్యనటుడిగా విడాకులు కావాలి నాటికలోని గంగోత్రి సాయి, ఉత్తమ ఆహార్యం ద్వారా బంధాల చంద్ర య్య నాయుడులోని పీవీ సత్యనారాయణ, ఉత్తమ సంగీతం మహాప్రస్థానంలోని నాగ రాజుకు,ఉత్తమ రంగాలంకరణ పి దీపక్ ప్రత్యేక బహుమతి ద్వారా బంధాల చంద్ర య్య నాయుడు కృష్ణ హితేష్ కు దక్కాయి. ప్రత్యేక బహుమతి హక్కు నాటికలో ని సతీష్ కు మరో ప్రత్యేక బహుమతి విడాకులు కావాలి లోని జి వసంత యామినికి లభించాయి.విజేతలకు వేమూరు శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు,పరుచూరి వెంకటేశ్వరరావు,సినీనటి పి శివపా ర్వతి, ఆలపాటి విజయలక్ష్మి తదితరులు నటీ, నటులకు బహుమతులు అందించారు.

## కిశోర బాలికలు పరిశుభ్రతను పాటించాలి: సిడిపివో



కొల్లూరు, మేజర్‌న్యూస్: కిశోర బాలికలు పరిశుభ్రతను పాటించాలని అమృతలూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి జి విజయలక్ష్మి అన్నారు.శుక్రవారం స్థానిక ఎస్ సి కాలనీ లోని అంగన్వాడీ కేంద్రంలో కిశోర వికాసం పై కిశోర బాలికలకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సమావేశం లో విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం కిశోర బాలికలకు వేసవి కాలంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశామన్నారు.గ్రామంలో ను కిశోర బాలికల 11 నుండి 14 సంవత్సరాలు, 15 నుండి 16 సంవత్సరాల వయసు గల బాలికలను గ్రూపులుగా ఏర్పాటు చేసి అందరూ పరిచయం చేసుకోవాలన్నారు. అందరకి పరిశుభ్రత గురించి వివరించారన్నారు. అనంతరం బాలబాలికులకు సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ సదస్సులు కౌమార బాల బాలికల సమస్యలను పోషణ అవసరాల ఆరోగ్యకరమైన పిల్లల సంరక్షణ మానవ అక్రమ రవాణా చట్టం, బాల్య వివాహాల నిర్మూలన, ఆత్మ రక్షణ, భేటీ బచావో భేటీ పడావో అంశాలు గురించి అవగాహన కల్పిస్తారన్నారు. ఎసీడీపీఓ విజయ రాణి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో జరిగే వేసవి శిబిరాలను కిశోర బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. మహిళలు చిన్నారుల పై జరిగే నేరాలు మోసాలపై 100, 112 నెంబర్లకు, చైల్డ్ లైన్ 1098, సైబర్ టోల్ ఫ్రీ 1930 నెంబర్లను సంప్రదించి ప్రభుత్వం సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎసిడిపివో విజయరాణి, సూపర్వైజర్ విజయలక్ష్మి, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చీరాల నుంచి అమరావతికి భారీగా తరలిన ప్రజలు



చీరాల, మేజర్‌న్యూస్: మండల పరిధిలోన చీరాల రాష్ట్ర రాజధాని అమరావతి పునర్ నిర్మాణ నిర్మాణ వేడుకలకు చీరాల నియోజకవర్గం నుంచి కూటమి శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. చీరాల మున్సిపల్ కార్యాలయం ఎమ్మెల్యే మాలకొండయ్య జెండా ఊపి అమరావతికి బస్సులను తరలించారు. దేశంలోనే ఆదర్శ రాజధానిగా తీర్చిదిద్దేందుకు అధినేత నారా చంద్రబాబు నాయుడు కార్యదీక్షను కలిగి ఉన్నాడని చెప్పారు. కేంద్ర సహకారంతో అమరావతిని మరింత అభివృద్ధి చేసి.. ఆంధ్రులకు కేరాఫ్‌గా అమరావతి ఉండబోతుందని చెప్పారు. ప్రధానికి నరేంద్ర మోడీ అనేక పథకాలకు చేస్తున్నశంకుస్థాపనలతో రాష్ట్ర రూపురేఖలే మారబోతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్దన్ రావు, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ రషీద్, ఎంపీడీవో శివ సుబ్రహ్మణ్యం, మెప్మా సీఎంఎం డిసిహెచ్ కొండయ్య, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు,కూటమి శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## బాల్య వివాహాలు ప్రమాదకరం

నాగులుప్పలపాడు, మేజర్‌న్యూస్: బాల్యవివాహాలు వలన ప్రమాదభరితంగా మారతాయని అంగన్ వాఢీ సూపర్ వైజరు శ్రీదేవి తెలిపారు మండలంలోని ఉప్పుగుండూరులో ని అంగన్ వాఢీ సెంటరులో కిషోరీ వికాసం వేసవి సెలవుల సందర్భంగా 11 సంవత్సరాల నుండి 18 సంవత్సరాలలోపు బాలికలకు అవగాహణ కార్యక్రమం నిర్వహించారు ఈసందర్భంగా శ్రీదేవి మాట్లాడతూ బాల్య వివాహాలు వలన కలిగే అనర్ధాలను వివరించారు చిన్న వయస్సులో వివాహం చేసుకోకుండా బాగాచదువుకొని ఉన్నతస్ధానానికి ఎదగాలన్నారు పంచాయతీ కార్యదర్శి ఎం కిరణ్ కుమార్ మాట్లాడుతూ చిన్నారుల తల్లిదండ్రులు చిన్నవయస్సులోనే పెండ్లి చేయకుండా బాగాచదివించాలని తెలిపారు బాలికలు కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన యాప్ ద్వార ఏమైన సమస్యలు ఎదురైనప్పుడు ముందుగా తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలన్నారు తద్వార వారికి రక్షణ కల్పించడం జరుగుతుందని తెలిపారు తొలుత బాలికలను పరిచయంచేసుకొని వారి గమ్యస్ధానం ఏమిటని తెలుసుకున్నారు అదేవిదంగా వినోదరాయిని పాలెంలో కిషోరి వికాసం వేసవి సెలవులు పై కార్యక్రమం నిర్వహించారు ఈకార్యక్రమంలో వినోదరాయిని పాలెం సర్పంచ్ ఘట్టమనేని అశోక్ ,మహిళా పోలీసులు నాగజ్యోతి ,అంగన్ వాఢీ కార్యకర్తలు మార్తమ్మ,చిన్నాయి, జయరాణి, కోటేశ్వరమ్మ, ఆశాకార్యకర్త తిరుమల, ఉప్పగుండూరులో ఏ ఎన్ ఎం హస్రిఫా, మహిళాపోలీసు విజయలక్ష్మి, అంగన్ వాఢీ కార్యకర్తలు ,ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# కగార్ ఆపరేషన్‌ను ఆపాలి

కర్రె గుట్ట నుంచి సాయుధ బలగాలను వెనక్కి రప్పించాలి

మావోయిస్టు పార్టీతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలి



ఒంగోలు, మేజర్‌న్యూస్: అటవీ, ఖనిజ సంపదలు, ప్రకృతి వనరుల్ని కార్పొరేట్ల సంస్థలకు అప్పగించే లక్ష్యంతో మధ్య భారతంలో జరుగుతున్న బూటకపు ఎన్కౌంటర్లని, అమాయక ఆదివాసి గిరిజనుల ఊచకోతను తక్షణమే ఆపాలని సిపిఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కామ్రేడ్ చిట్టిపాటి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కగార్ ఆపరేషన్‌ని ఆపి, వెంటనే కాల్పుల విరమణ ప్రకటించాలని, మావోయిస్టు పార్టీతో కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్చలు జరపాలని, మధ్య భారత దండకారణ్యంలో శాంతియుత వాతావరణం నెలకొల్పాలని రాష్ట్ర పార్టీ ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం ఒంగోలులోని ప్రకాశం భవనం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సిపిఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్. మోహన్ అధ్యక్షత వహించారు. కామ్రేడ్ చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆపరేషన్ కగార్ ఆదివాసీల అణచివేత చత్తీస్ ఘడ్, అబూజ్ మడ్ ప్రాంతంలో మొత్తం 4000 చదారపు కిలోమీటర్ల దట్టమైన అటవిప్రాంతంలో కొనసాగుతుందన్నారు.ఇందులో 237 గ్రామాల్లో గోండు, మోరియా, అబూజ్, హల్బా తెగ లకు చెందిన 35,000 మంది ఆదివాసులు జీవిస్తున్నారని, ఇక్కడ ఇనుప ఖనిజం, గ్రాఫైట్ సున్నపురాయి, యురేనియం, తదితర ఖనిజనిక్షేపాలు ఉన్నాయని, ఇవి కార్పోరేట్ సంస్థలకు అప్పజెప్పేందుకు ప్రభుత్వం ఇప్పటికే 104 ఒప్పందాలు కుదుర్చుకుందన్నారు. ఈ ఒప్పందం అమలులో భాగంగా మోడీ ప్రభుత్వం అమాయక ఆదివాసులపై హత్యాకాండ కొనసాగిస్తుందన్నారు. మావోయిస్టు పార్టీ కేంద్రంతో చర్చలకు ఆహ్వానించడానికి మా పార్టీ బలపరుస్తుందని, తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఆ పని పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొండారెడ్డి, ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్, రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి భీమవరపు సుబ్బారావు, సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, ప్రజా కళా మండలి రాష్ట్ర కార్యదర్శి కోటి, పిఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి పద్మ, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు నాంచార్లు, పిడిఎస్ యూ రాష్ట్ర నేత రాజశేఖర్, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షులు జాలన్న, తదితరులు పాల్గొన్నారు.

# అమరావతికి బయలుదేరిన కూటమి శ్రేణులు



తాళ్లూరు, మేజర్‌న్యూస్: అమరావతి పునః ప్రారంభోత్సవ కార్యక్రమానికి వస్తున్న ప్రధాని మంత్రి నరేంద్రమోదీ సభకు తాళ్లూరు మండలం నుంచి భారీగా నాయకులు, మహిళలు తరళి వెళ్లారు. దర్శి నియోజకవర్గం టీడీపీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ కడియాల లలిత్ సాగర్‌ల ఆధ్వర్యంలో ఐదు బస్సుల్లో మహిళలు, కూటమి నాయకులు, కార్యకర్తలు భారీగా తరళివెళ్లారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణం నుంచి ఈ బస్సులకు మండల టీడీపీ అధ్యక్షులు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, తదితరులు జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ప్రధాని మంత్రి సభకు వెళ్లడం ఆనందంగా ఉందని మహిళలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శాగం కొండారెడ్డి, ఇడమకంటి శ్రీనివాస్ రెడ్డి గొల్లపూడి వేణు బాబు, మానం రమేష్ బాబు, రాచకొండ వెంకట్రావు, పెద్ద కాలేషావలి, చాట్ల డాని, క్రైపు రామకోటి రెడ్డి,కె. రామయ్య, లక్ష్మీనారాయణ, మహిళలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# వర్ష ప్రభావిత బాధితుల సమస్యలు తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్



కనిగిరి, మేజర్‌న్యూస్: పట్టణంలో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని బోయపాలెంలో వర్షపు నీరు రహదారుల పైకి, ఇళ్లలోకి ప్రవహించడంతో ఇబ్బందులు పడ్డ విషయాన్ని స్థానిక ప్రజలు మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ దృష్టికి తీసుకువెళ్లారు. మున్సిపల్ చైర్మన్ వెంటనే సానిటరీ ఇన్స్పెక్టర్ నాయబ్ రసూల్, సిబ్బందితో కలిసి బోయపాలెంకు వెళ్లి స్థానిక ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బోయ పాలెంలో ఓవైపు మాత్రమే డ్రైనేజీ కాలువ ఉండడంతో, వర్షపు నీరు ప్రవహించే అవకాశం లేక ఇలలోకి ప్రవహి స్తుందని, స్థానికంగా ఉన్న పెద్ద డ్రైనేజీ కాలువలో వర్షపు నీరు ప్రవహించే అవకాశం లేక అవి కూడా ఇళ్లలోకి చేరుతున్నాయని స్థానికులు మున్సిపల్ చైర్మన్‌కు వివరించారు. స్పందించిన మున్సిపల్ చైర్మన్ అబ్దుల్‌గఫార్. బోయ పాలెంలో మరోవైపు కూడా డ్రైనేజీ కాలువ నిర్మిం చేందుకుచర్యలు తీసుకుంటామన్నారు.

అదే విధంగా అక్కడ ప్రవహిస్తున్న మట్టి కాలువకు కూడా మరమ్మ తులు చేపట్టి, ఐదు అడుగుల లోతు వరకు కాలువలో పూడికతీత పనులు చేపడుతామన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామన్నారు.

# అంగరంగ వైభవంగా బ్రహ్మంగారి వార్షిక తిరునాళ్ళ



దొనకొండ మేజర్‌న్యూస్: దొనకొండ నాలుగు రోడ్ల కూడలిలోని ఆనందాశ్రమంలో వెలసియున్న గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి వార్షిక తిరుణాళ్ళ శుక్రవారం ఆలయ ధర్మకర్త భైరవానందస్వామి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగింది ఉదయం నుంచి స్వామి వారికి శ్రీ వీరబ్రహ్మ సుప్రభాతం పంచామృత అభిషేకాలు ప్రత్యేక పూజలు చేసి అందంగా అలంకరించి గోవిందమాంబవీరబ్రహ్మేంద్ర స్వామి వార్ల కళ్యాణ మహోత్సవం నిర్వహించారు వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు సాయంత్రం ఏడు గంటల నుంచి ఒంగోలు అచలానంద స్వామివారి ప్రియ శిష్యులు శ్రీ పరిపూర్ణ సిద్ధాంత స్వామి వారి ప్రవచనములు చెప్పారు చుట్టూ ప్రక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కోడెలకు నివాళులర్పించిన గొట్టిపాటి లక్ష్మి



దర్శి, మేజర్‌న్యూస్: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, నవ్యాంధ్ర తొలి శాసనసభ స్పీకర్, మాజీ మంత్ర స్వర్గీయ డాక్టర్ కోడెల శివప్రసాదరావు జయంతి సందర్భంగా ఆయన స్మృతికి దర్శి నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఘననివాళులు అర్పించారు. వైద్యునిగా, తిరుగులేని నాయకుడిగా ఆయన ప్రజలకు విశేష సేవలందించారని ఆమె అన్నారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచి పల్నాటి పులిగా పేరుగడించారని, తెలుగుదేశం పార్టీకి కోడెల శివప్రసాదరావు చేసిన సేవలు మరువలేనివి. ఆయన చేసిన మంచి పనులతో ప్రజల హృదయాల్లో నిలిచే ఉన్నాయని ఆమె అన్నారు. ఆ ప్రజానేత జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుందమని డాక్టర్ లక్ష్మి కోరారు.

## అమరావతి పునః ప్రారంభోత్సవానికి తరలివెళ్లిన మండల ప్రజలు



జరుగుమల్లి, మేజర్‌న్యూస్: అమరావతి పునః ప్రారంభోత్సవంకు మండల టిడిపి కన్వీనర్ పోకూరి రవీంద్రబాబు ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో జరుగుమల్లి మండలం ప్రజలు వెళ్లారు ప్రతి గ్రామంలో వాహనాలు సౌకర్యం కల్పించడం జరిగిందని మండల పార్టీ కన్వీనర్ తెలిపారు ఈ ప్రభుత్వం పేదల కోసం పనిచేస్తుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

# కార్యదర్శిపై విచారణ వాయిదా



నాగులుప్పలపాడు, మేజర్‌న్యూస్: మండలంలోని మట్టిగుంట గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఎం బెనహర్ ఇటీవల కాలంలో ఉప్పుగుండూరు పంచాయతీలో ఇన్‌చార్జి కార్యదర్శిగా పనిచేసారు ఆసమయంలో అవినీతి జరిగినట్లు పంచాయతీ 14వ వార్డు మెంబరు కనగాల శ్రీనివాసరావు పంచాయతీ జిల్లా అధికారులకు పిర్యాదు చేశారు. అదేవిదంగా ఈదుమూడి, మట్టిగుంట, ఒమ్మె వరం తదితర పంచాయతీల నుండి కార్యదర్శి బెన హర్‌పై పలు ఆరోపణలు రావడంతో జిల్లా ఉన్నతాధికా రుల ఉత్తర్వుల మేరకు శుక్రవారం డిఎల్‌పిఓ పద్మావతి నాగులుప్పలపాడు పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. దాంతో పిర్యాదు దారుడు హజరు కాకపోవడంతో విచారణ వాయిదా వేసినట్లు డిఎల్‌పిఓ పద్మావతి తెలిపారు. బెనహర్ చేసిన సమయంలో అందుకు సంబందించిన రికార్డులను స్వాదీనం చేసుకున్నారు. ఈకార్యక్రమంలో బెనహర్ తో పాటు ఉప్పుగుండూరు పంచాయతీ ప్రస్తుత కార్యదర్శి ఎం కిరణ్ కుమార్, ఈదుమూడి కార్యదర్శి డి వి రంగారెడ్డి తదితరులు ఉన్నారు.

# సమసమాజ స్థాపన కోసం యుటిఎఫ్ కృషి




దర్శి, మేజర్‌న్యూస్: సమ సమాజ స్థాపన కోసం యు.టి.ఎఫ్ పనిచేస్తుందని రాష్ట్ర గౌరవఅధ్యక్షులు కె.శ్రీనివాస రావు తెలిపారు. రామిరెడ్డి స్మారకోపన్యాస సభ స్థానిక పీజీన్ కల్యాణ మండపం నందు ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్‌హై అధ్యక్షతన సభను నిర్వహించారు. ముందుగా పాత కోర్టు సెంటర్‌లో దర్శి యు.టి.ఎఫ్ డివిజన్ ఆధ్వర్యంలో రామిరెడ్డి వర్ధంతి సందర్భంగా చలి వేంద్రాన్ని రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ప్రారంభించి, కల్యాణ మండపం నందు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్ ప్రసాద్, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మొజు శ్రీనివాసరావులు, డి.రామిరెడ్డి నివాళి అర్పించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు నక్కా మాట్లాడుతూ పోరాటమే హక్కుల సాధనకు మార్గమని అధ్యక్షులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి డి.వీరాంజనేయులు, గౌరవ అధ్యక్షులు ఎస్.రవి, ఆడిట్ కమిటీ కన్వీనర్ రాము, జిల్లా సహాధ్యక్షూరాలు జి.ఉమామహేశ్వరి, కోశాధికారి చిన్న స్వామి. జిల్లా కార్యదర్శులు మీనిగ శ్రీను, టి.రాజశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్ జి.కోటేశ్వరరావు, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ జి.విజయ్‌కుమార్, ఈ.రోశయ్య, దర్శి మండల అధ్యక్షులు కె. శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పి.ఖాసిం, అన్నెం శ్రీనివాసరెడ్డి, బత్తుల వెంకటేశ్వర్లు, కె.సురేష్‌బాబు, యం.విరమణారెడ్డి, ప్రధానకార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. మండల విద్యాశాఖాధికారులు రఘు రామయ్య, బి.రమాదేవి పాల్గొన్నారు.

# నగర పంచాయతీ ప్రజల శ్రేయస్సు కమిషనర్ ధ్యేయం



పొదిలి, మేజర్ న్యూస్: నగర పంచాయతీలో నివసించే ప్రజల శ్రేయస్సు కోసం కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కేఎల్ఎన్ నారాయణరెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారు. నగర పంచాయతీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వద్ద నుండి నిత్యం అన్ని ప్రాంతాల్లో తానే స్వయంగా పర్యటిస్తూ పారిశుద్ధ విషయంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని తక్షణమే పరిష్క రిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షానికి ఆర్టీసీ డిపో ప్రాంతంలో కాలువల్లో మురుగునీరు పారే వీలు లేక రోడ్లపై మురుగు నీరు చేరుతుందనే విషయం తెలుసుకున్న కమిషనర్ నారాయణరెడ్డి తక్షణమే స్పందించి, ఆ ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించి సిబ్బందిచే కాలువలను శుభ్రం చేయించారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు కమిషనర్ నారాయణరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. గతంలో పనిచేసిన అధికారులు ప్రజా సమస్యలను గాలికి వదిలేసినా, కమిషనర్‌గా నూతన బాధ్యతలు చేపట్టిన నారాయణరెడ్డి ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సాధించటం పట్ల నగర పంచాయతీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు ఆయన వెంట మారుతి రావు పాల్గొన్నారు.

## 5న కనిగిరిలో ఏపిటిఎఫ్ నిరసన




కనిగిరి, మేజర్‌న్యూస్: అన్ని ప్రాథమిక పాఠశాలల్లో 1 నుండి 5 తరగతులు ఉండే విధంగా మోడల్ ప్రాథమిక పాఠశాలలు లేదా బేసిక్ ప్రైమరీ స్కూల్స్ మాత్రమే ఉండాలని, ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు ను కొనసాగించాలని, 1 నుండి 5 తరగతులు హైస్కూల్‌కు అనుసంధానం చేసే విధానం విరమించుకోవాలనే తదితర డిమాండ్ ల సాధన కోసం రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈ నెల 5వ తేదీ ఉదయం 10 గంటలకు కనిగిరి తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్, రాష్ట్ర కౌన్సిలర్ పి.రాజకుమార్ కోరారు. శుక్రవారం కనిగిరి జోన్ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత కలిగిన అన్ని యూపీ స్కూల్స్ కొనసాగించాలని, ఉన్నత పాఠశాలలో 45 మంది దాటినచోట రెండవ సెక్షన్, ఆ పై ప్రతి 35 మందికి అదనపు సెక్షన్లు ఏర్పాటు చేయాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలకు 2 ఎస్‌జిటి పోస్టులు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 3 డీఏలు విడుదల చేయాలని, 12వ పిఆర్సీ ప్రకటన విడుదల చేయాలని, 30శాతం మధ్యంతర భృతి చెల్లించాలని, 11వ పిఆర్సీ ఆర్థిక బకాయిలు విడుదల చేయాలనీ, సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. 5న జరిగే నిరసన కార్యక్రమంలో జోన్‌లో 6 మండల శాఖ బాధ్యులు, సభ్యులు, అభిమానులు, జిల్లా బాధ్యులు, పూర్వ జిల్లా బాధ్యులు హాజరై ఈ నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో ఏపిటిఎఫ్ నాయకులు కెవి సుబ్బయ్య, షేక్ హుస్సేన్, కె.రామ్మోహన్, పి.మాలకొండయ్య, ఎన్‌వి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కిశోర వికాసం బాలిక బంగారు భవిష్యత్తుకు పునాది




కనిగిరి, మేజర్‌న్యూస్: కిశోర వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని, ఉజ్వల,ఆరోగ్యకరమైన,సాధికారిత దిశగా ఆమె వేసే అడుగుకు సమిష్టి కృషితో చేయూతనిద్దామని ఐసిడిఎస్ కనిగిరి ప్రాజెక్ట్ అధికారి సరోజిని అన్నారు. శుక్రవారం కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని శంఖవరం ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో కిశోర వికాసం శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయా ఆదేశాల మేరకు బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో కిశోర వికాసం కార్యక్రమం మే 2నుండి జూన్ 10 వరకు 11 నుంచి 18 ఏళ్ల బాలికలు చదువుపై దృష్టి పెట్టేలా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. బాలికల్లో ఆత్మరక్షణ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం, డిజిటల్ భద్రత, సైబర్‌క్రైమ్, ఆన్‌లైన్ వేదికలపై జాగ్రత్తగా వుండేలా అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. నైపుణ్యాభివృద్ధి, వృత్తి విద్య, ఉపాధి అవకాశాలు పెంచడం, రక్తహీనతను నివారించడం, బాల్య వివాహాలను అడ్డుకోవడం, యోగా, శారీరక వ్యాయామాన్ని ప్రోత్సహించడం తదితరాలపై శిక్షణ ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ సుమతి, మహిళా పోలీస్ అనూష, ఎఎన్ఎం వి.శైలజ, సర్పంచ్ దమ్ము వెంకటయ్య, బంగారు బాల్యం సభ్యులు, గుడ్ హెల్ప్ రమేష్ బాబు, మెప్మా ఆర్‌పిలు మస్తాన్ బి, మల్లేశ్వరి, సుజాత, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాష్ట్రరాజధాని అమరావతి శంకుస్థాపనకు భారీగా వెళ్ళిన టిడిపి శ్రేణులు

పొదిలి, మేజర్ న్యూస్: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆంధ్ర రాష్ట్ర రాజధాని అమరావతి శంకుస్థాపన కార్యక్రమానికి శుక్రవారం టిడిపి శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. అమరావతి శంకుస్థాపన కార్యక్రమానికి వెళ్లిన వారిలో చిన్న చెరువు నీటి సంఘం అధ్యక్షులు చాగంటి వెంకటరావు, బూత్ కన్వీనర్ కాటూరి హనుమంత రావు, యువ నాయకులు దంతులూరి వెంకటరావు, వీరగంధం వెంకటరావు తదితరులు ఉన్నారు.



## బాల్య వివాహాల అనర్ధాలపై అంగన్వాడీలు అవగాహన కలిగించాలి

### బాలల సంరక్షణ అధికారి శ్రీలక్ష్మి



మర్రిపూడి, మేజర్‌న్యూస్: బాల్య వివాహాల వల్ల కలిగే అనర్ధాలపై గ్రామస్థాయిలో తల్లి దండ్రులకు అవగాహన కలిగించాల్సిన బాధ్యత అంగన్వాడీల పై ఉందని బాలల సంరక్షణ అధికారి శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కిషోర్ వికాస శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బాలల సంరక్షణ అధికారి శ్రీ లక్ష్మీ మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధ చట్టాన్ని తప్పక పాటించాలని చెప్పారు. అమ్మాయికి 18 సంవత్సరాలు అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చేయాలని తెలిపారు. వెంకటలక్ష్మి, అంగన్వాడి సూపర్వైజర్ బి సుచరిత, డాక్టర్ వీరబాబు, ఎంపీఎం కోటేశ్వ రరావు, అంగన్వాడీ కార్యకర్తలు, వివో ఏలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్ బిల్లును వెంటనే రద్దు చేయాలి

సంతమాగులూరు మేజర్‌న్యూస్: కేంద్రం లోని నరేంద్రమోడీ ప్రభుత్వం కార్మికులకు రక్షణగా ఉన్న చట్టాలను నిర్వీర్యం చేసి కొత్తగా తీసుకువచ్చిన లేబర్ కోడ్ చట్టం వలన కార్మిక వ్యవస్థ నిర్మూలనకు గురవుతుందని కార్మికులకు రక్షణ లేకుండా పోతుందని కార్మికుల వెన్ను విరిచే ఈ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేసుకోవాలని సిఐటియుడిమాండ్ చేసింది. మండలంలోని ఏల్చూరు బస్టాండ్ సెంటర్లో సిఐటియు జెండాను ఆవిష్కరించి నాయకులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న టిడిపి యువనేత వెంకటరెడ్డి



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: శుక్రవారం కనిగిరి పట్టణానికి సమీపంలో కొత్తూరు వద్ద రహదారిపై చాకిరాల గ్రామానికి చెందిన యువకుడు ద్విచక్రవాహనంపై కిందపడి దెబ్బలు తగిలి ఉండటంతో కనిగిరి వెళ్తున్న సి.ఎస్.పురం మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన మండల తెలుగు యువత ప్రధానకార్యదర్శి చెరుకుపల్లె వెంకటరెడ్డి మానవత్వంతో భాదితుని పరామర్శించి వెంటనే తనకారులో స్థానిక వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు. ఈ సందర్భంగా దెబ్బలుతగిలిన బాధితుడిని వెంటనే వైద్యశాలకు తరలించి చికిత్స చేయించి మానవత్వం చాటుకున్న వెంకటరెడ్డిని పలువురు అభినందించారు.

## గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల బాలికల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ఉలవపాడు, మేజర్‌న్యూస్: మండలంలోని కరేడు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సం క్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఈనెల 20 తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవలసిందిగా ప్రిన్సిపాల్ యన్ వెంకట సుబ్బయ్య శుక్రవారం తెలిపారు. మొత్తం ఖాళీలు 192 సీట్లు, 3వ తరగతికి 40, ఇందులో ఎస్టి-32, ఎస్సీ-05, బిసి-02, ఓసి-01 మాత్రమే, మిగిలిన 152 సీట్లు 4వ తరగతి ఎస్టీలకు-38 సీట్లు, 5వ తరగతికి -33, 6వ తరగతికి-32, 7వ తరగతికి-13, 8వ తరగతికి-17, 9వ తరగతికి-19 సీట్ల ఖాళీలకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. 4వ నుంచి 9వ తరగతి వరకు ఉన్న ఖాళీల్లో అర్హత కలిగిన ఎస్టీ విద్యార్థులు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తు దారుల సంవత్సర ఆదాయము లక్ష రూపాయలు మించరాదు. వివరాలకు కరేడు గిరిజన పాఠశాలను సంప్రదించాలని ఆయన తెలిపారు.

## అమరావతికి భారీగా తరలివెళ్లిన మండల ప్రజలు




టంగుటూరు, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రరాజధాని అమరావతి పున: ప్రారంభోత్సవ కార్యక్రమంలో భారత ప్రధాని మోడీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొననున్న సభకు టంగుటూరు మండలంలోని అన్ని గ్రామాల నుండి భారీ సంఖ్యలో అధికారులు, టిడిపి నాయకులు కార్యకర్తలు బస్సులలో శుక్రవారం 9గంటలకు బయలుదేరి వెళ్లారు. టంగుటూరు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద అమరావతి వెళ్లే అధికారులు, నాయకులు, కార్యకర్తలు మండల టిడిపి అధ్యక్షులు కే.విజయ్ కుమార్, మాజీ సర్పంచ్ బెల్లం జయంతి బాబు, టిడిపి నాయకులు బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో దేవసేనకుమారి, ఏపిఎం బుర్ర సుబ్బారావు, ఏపీవో మాచర్ల, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



కనిగిరి, మేజర్‌న్యూస్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసిడిఎస్ సూపర్ వైజర్ ఎంవిఎస్ పార్వతి తెలిపారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, వివిధ శాఖల సమన్వయంతో కిషోర్ వికాసం కార్యక్రమం తక్కెళ్ళపాడు గ్రామపంచాయతీలోని కంచర్లవారిపల్లి హైస్కూల్లో శుక్రవారం ప్రారంభించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎం.వి.ఎస్.పార్వతి అధ్యక్షత వహించగా, మహిళా సంరక్షణ కార్యదర్శి కె.శాంతి కన్వీనర్‌గా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం మే 2 నుండి జూన్ 10వరకు జరుగుతుందన్నారు. 18 సంవత్సరాలు నిండనిదే బాల్యవివాహాలు చేసుకోవద్దని, బాలిక విద్య,గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి ఎం.ఎస్.కె తెలియజేశారు. సూపర్వైజర్ పార్వతి మాట్లాడుతూ కౌమారదశలో బాలికలలో కలిగే సమస్యలు, వ్యక్తిగత పరిశుభ్రత, తీసుకోవలసిన పోషకాహారం, ఒత్తిడిని అధిగమించి జీవన నైపుణ్యాలను గురించి వివరించారు. అంగన్వాడీ కార్యకర్తలు పి.కళ్యాణి, ఎం.రవణమ్మ పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com



## గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో అమరావతికి భారీగా తరలివెళ్ళిన ప్రజలు

దర్శి మేజర్‌న్యూస్: దర్శి నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో నియోజకవర్గం నలు మూలలునుండి అమరావతికి ప్రజలు భారీగా తరలి వెళ్లారు. ఆంధ్రుల ఆత్మగౌరవ పతాకగా, రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు పునాదిగానారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో ప్రపంచస్థాయి రాజధాని నగరానికి బీజం పడిన శుభ సందర్భాన. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ,ముఖ్య అతిథిగా హాజరైన అమరావతి పునః ప్రారంభోత్సవ కార్యక్రమానికి దర్శి నియోజకవర్గం నలుమూలల నుండి అమరావతి పునః ప్రారంభ సభకు వేలాదిగా ప్రజలు తరలి వెళ్లారు. నియోజకవర్గం నుండి సుమారు 50 బస్సు లు, వందలాది కార్లు లలో ప్రజా రాజధాని అమరావతి పునః నిర్మాణ కార్యక్రమం నకు ర్యాలీ గా తరలివెళ్లారు. నియోజకవర్గం నలు మూలాలు నుండి తరలివచ్చి సభను విజయవంతం చేసిన ప్రజలకు, కూటమి నేతలకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా డాక్టర్ లక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

## మోడీ సభకు తరలిన కూటమి నేతలు



పంగులూరు, మేజర్‌న్యూస్: అమరావతి పునర్నిర్మాణ సభకు జె పంగు లూరు మండలం ముప్పవరం గ్రామం నుండి కూటమి నేతలు తరలి వెళ్లారు. ఆంధ్రుల రాజధాని అమరావతి పునర్నిర్మాణం సభను జయప్రదం చేసేందుకు భారీగా మండలంలోని అన్ని గ్రామాల నుండి కూటమి నేతలు, తెలుగు తమ్ముళ్లు, మహిళలు బస్సులలో ప్రైవేటు వాహనాలలో అమరావతికి తరలి వెళ్లారు. అన్ని వాహనాలు ముప్పవరంలో ర్యాలీల కదలి వెళ్లాయి. మండల నాయకులు రావూరి రమేష్, కుక్క పల్లి ఏడుకొండలు, మండలంలోని అన్ని గ్రామాల నాయకులు తరలి వెళ్లారు.

## ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ

యర్రగొండపాలెం, మేజర్‌న్యూస్: జమ్మూకాశ్మీర్ పెహల్గామ్‌లో పర్యాట కులపై జరిగిన ఉగ్ర వాదుల దాడిని ఖండిస్తూ శుక్రవారం సాయంత్రం యర్రగొండపాలెం పట్టణంలో కొవ్వొత్తులతో శాంతి యత నిరసన ర్యాలీని జామియతే- ఉలేమా ఏ-హింద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలోని ఎన్టీఆర్ బొమ్మ దగ్గర నుంచి అంబేద్కర్ కూడలి వరకు ఈ ర్యాలీ చేపట్టారు. అనంతరం హిందూ ముస్లింల ఐక్యత వర్ధిల్లాలని ఉగ్రవాదం నశించాలని ముస్లింలు నినాదాలు చేశారు.

## ఉచిత విద్య కోసం ధరఖాస్తు చేసుకోవాలి

నాగులుప్పలపాడు, మేజర్‌న్యూస్: విద్యాహక్కు చట్టం ప్రకారం బడుగు బలహీన వర్గాల పిల్లల కోసం మండలంలోని అన్ని ప్రయివేట్ అన్ ఎయి డెడ్ పాఠశాలల్లో ఒకటవ తరగతి ప్రవేశం కోసం ధరఖాస్తు చెసుకోవాలని ఎంఇఓలు టి.రవి, ఇవి రమణయ్యలు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 25 శాతం బడుగు బలహీన వర్గాల పిల్లలకు కేటాయించాలని తెలిపారు. 2025-2026 విద్యా సంవత్సరంలో సిబిఎస్ ఈ స్టేట్ సిలబస్ అనుసరిస్తున్న పాఠశాలల్లో ప్రవేశానికి ధరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు 2019 ఎప్రిల్ 2 నుండి 2020 మే 30 వతేది మధ్య జన్మించి ఐదు సంవత్సరాలు నిండిన బాలలు అర్హులని తెలిపారు మే 2 వతేది 19వ తేది వరకు సచివాలయాలు మీ సేవా సెంటర్లో ఆన్ లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చు అని తెలిపారు.





## కిశోరి వికాసం పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

ఒంగోలు, మేజర్‌న్యూస్: జిల్లా వికాసం అవగాహన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆవిష్కరించారు. శుక్రవారం ప్రకాశం భవనంలోని కలెక్టర్ ఛాంబర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. కిశోరి వికాసం ఉద్దేశ్యాన్ని వివరించారు. బాలికలు, బాలురు 11నుండి 18 సంవత్సరాల వయస్సు అభివృద్ధిని, సాధికారతను పంపించడ మని దీని ద్వారా పిల్లలు పెళ్లిళ్లు అడ్డుకోవటం ఆరోగ్యం విద్య పోషణ బాలికలు, బాలురులకు వారి హక్కులపై అవగాహన కల్పించడం. పాఠశాలకు చేరవడంలో పున నైపుణ్యాలు భద్రతా, ఉపాధికి అవకాశాలు కల్పించడం లాంటి ముఖ్య లక్షణాలను చేరుకోవటం అనే చేరడంలో సహాయం చేయటం పరస్పర సహకారం వ్యక్తిగత అభివృద్ధి నాయకత్వ లక్షణాలు పెంపొందించడం సరిగ్గా ఆహారం తినటం ఆరోగ్యవంతమైన జీవనం గడపటం శరీరక మార్పులు పెళ్లిళ్లు పుట్టుక వంటి విషయాల్లో అవగాహన కల్పించటం, బాల్య వివాహాలు ఆన్లైన్ భద్రత సమస్య సమస్యలు వేధింపుల నుండి రక్షణ జీవిత నైపుణ్యాలు ఉపాధి అవకాశాలు బాల కార్మికత్వం లైంగిక అస్మానితులు వంటి సమస్యలపై అవగాహన ప్రభుత్వ పథకాలు గురించి తెలియజేయడమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్, ప్రకాశం జిల్లా వారు పాటు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారిత అధికారిణి, బి. హేన సుజాన, జిల్లా బాలల సంరక్షణ అధికారి పి. దినేష్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. వెంకటేశ్వర్లు, జిల్లా విద్యా శాఖాధికారి కిరణ్ కుమార్, ఎన్జీవో సునీల్ కుమార్, డిఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

## అనారోగ్య బాధితునికి హైదరాబాద్ వెళ్ళి పింఛన్ పంపిణీ



కొమరోలు, మేజర్‌న్యూస్: అనారోగ్యంతో హైదరాబాదులోని ఉస్మానియా హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న రోగికి సామాజిక భద్రతా పెన్షన్ను స్థానిక పుల్లారెడ్డి పల్లె పంచాయతీ కార్యదర్శి జయలక్ష్మి హైదరాబాద్ వెళ్లి పంపిణీ చేశారు. స్థానిక ఎంపీడీవో సయ్యద్ మస్తాన్ వలి ఆదేశాల మేరకు కార్యదర్శి జయలక్ష్మి మూడు నెలలుగా పెన్షన్ పొందకుండా అనారోగ్యం కారణంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భూపాల్ రెడ్డి అనే బాధితునికి, స్వయంగా వచ్చి తీసుకొని వెళ్లే అవకాశం లేకపోవడంతో, మరోవైపు బాధితుడు సామాజిక భద్రతా పెన్షన్ ని పోగొట్టుకునే పరిస్థితి ఉన్నందున, మానవతా దృక్పథంతో బాధితుని పరిస్థితి తెలుసుకొని బాధ్యతగా పై అధికారుల అనుమతి తీసుకొని హైదరాబాద్ వెళ్లి, ఆసుపత్రిలో ఉన్న బాధితునికి 18 వేల రూపాయలు పెన్షన్‌ను శుక్రవారం అందజేశారు. బాధిత కుటుంబం స్థానిక ఎంపీడీఓకు, పంచాయతీ కార్యదర్శికి, పైఅధికారులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.

## ప్రకాశం కళాశాల ఫ్యాకల్టీకి పిహెచ్‌డి డిగ్రీ



కందుకూరు, మేజర్ న్యూస్: ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన కంప్యూటర్ సైన్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కలవకురి మోహనరావుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాల యం నుంచి పీహెచ్.డి డిగ్రీ మంజూరైంది. 2025 ఏప్రిల్ 18న ఆయనకు డిగ్రీ లభించింది. “క్లౌడ్ కంప్యూటింగ్ వాతావరణంలో డీప్ లెర్నింగ్ ఆధారితంగా వర్క్‌లోడ్ అంచనా మరియు వనరుల కేటాయింపు నమూనాల పనితీరు మెరుగుదల” అనే అంశంపై క్లౌడ్ కంప్యూటింగ్, డీప్ లెర్నింగ్ రంగాల్లో పరిశోధన నిర్వహించారు. ఆయన పరిశోధనకు మార్గదర్శకుడిగా డా.బొబ్బా బసవేశ్వ రరావు పని చేశారు. వైవా పరీక్షను శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నుంచి డా. గీతాంజలి నిర్వహించారు. కాలేజీ కరస్పాండెంట్ డా. కె. రామయ్య మాట్లాడుతూ, “శ్రమిస్తే సాధ్యమయ్యే లక్ష్యాలకు మోహనరావు బలమైన ఉదాహరణ. ఆయన నిబద్ధత యువ శాస్త్రవేత్తలకు ప్రేరణగా నిలుస్తుంది” అన్నారు. టెక్నికల్ డైరెక్టర్ డా. కె. విజయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, “ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీ పరిశోధనను ప్రోత్సహించే వాతావరణాన్ని అందించడమే కాక, ప్రతిభావంతుల అభివృద్ధికి పునాది వేస్తోంది. డా. మోహనరావు విజయం అందుకు నిదర్శనం” అన్నారు. ప్రిన్సిపల్ డా. సి.హెచ్. రవి కుమార్ మాట్లాడుతూ, “ఈ విజయం కాలేజీ ఖ్యాతిని మరింత పెంచింది” అన్నారు.వైస్ ప్రిన్సిపల్ వి. హరి బాబు, “ఇది విద్యార్థులకు స్ఫూర్తినిచ్చే ఘనత” అన్నారు. డాక్టర్ మోహనరావు మాట్లాడుతూ, పరిశోధనలో మద్దతు అందించిన కాలేజీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయం వ్యక్తిగత అభివృద్ధికే కాక, విద్యా ప్రమాణాల మెరుగుదలకు దోహదపడుతుందన్నారు. కాలేజీ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు డాక్టర్ మోహనరావును అభినందించారు.

## రిమ్స్‌లో కార్డియాలజీ విభాగంలో ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేయాలి



ఒంగోలు, మేజర్‌న్యూస్: ఒంగోలు సర్వజన వైద్యశాలలో కార్డియాలజీ విభాగం నందు ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్-2, ప్రొఫెసర్-1 పోస్టులను త్వరగా భర్తీ చేయాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు బిళ్ళా చెన్నయ్య ప్రభుత్వ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జోనల్ ఇన్‌చార్జ్ అధికారి ఎం.టి కృష్ణబాబును కోరారు.

### జోనల్ ఇన్‌చార్జ్ అధికారి కృష్ణబాబుకి బిళ్లా చెన్నయ్య వినతి

ఒంగోలు వచ్చిన ఆయన్ను ప్రకాశం భవనంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లా నలుమూలల నుండి హృదయ సంబంధిత వ్యాధిగ్రస్తులు ఒంగోలు సర్వజన వైద్యశాలకు వైద్యం నిమిత్తం తరలిరావడం జరుగుతుంది. ఈ క్రమంలో సర్వజన వైద్యశాల నందు కార్డియాలజీ విభాగంలోని ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్-2, ప్రొఫెసర్-1 పోస్టులను త్వరగా భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడం వలన ప్రజలకు ఇంకా మెరుగైన సేవలు అందే అవకాశం ఉందని, ఈ అంశాన్ని పరిశీలించాలని కోరారు.

## ఆకస్మిక వర్షానికి దెబ్బ చిన్న పంటలు



సంతమాగులూరు మేజర్ న్యూస్: శుక్రవారం తెల్లవారుజామున సుమారు 5 గంటల ప్రాంతంలో కురిసిన వర్షానికి పాత మొగులూరు గ్రామానికి చెందిన ఐదుగురు రైతులు వేసిన బొప్పాయి తోట పూర్తిగా నేలకొరిగింది ఈదురుగాలతో వచ్చిన వర్షానికి సంతమాగులూరు నుండి పిల్లల చేరువు వరకు రోడ్డుపై చెట్లు కొమ్మలు పడి రవాణాకు అంతరాయం కలిగింది వ్యవసాయ శాఖ అధికారులు తమను ఆదుకోవాలని రైతులు అర్థిస్తున్నారు.

## పట్టణంలో ఆధార్ కేంద్రం ప్రారంభం



గిద్దలూరు, మేజర్‌న్యూస్: పట్టణంలోని రాచర్ల రైల్వే గేట్ సమీపంలో ఉన్న సెయింట్ పాల్స్ పాఠశాల ఆవరణలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సిటీ సంస్థ ఆధ్వర్యంలో ఆధార్ సేవ కేంద్రాన్ని శుక్రవారం మండల విద్యాశాఖ అధికారులు కావడి వెంకటేశ్వర్లు, నాగభూషణ్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ ఆధార్ అప్డేట్ సెంటర్‌లో ఆధార్ కార్డులో ఉన్న పేరు తప్పులను సరి చేసుకోవడంతో పాటు ఫోటో అప్డేట్, వేలిముద్రల అప్డేట్, చిరునామా మార్పులు, డేట్ అఫ్ బర్త్ మార్పులు చేసుకోవచ్చని ఆధార్ సెంటర్ నిర్వాహకులు నాగూర్ తెలిపారు. గిద్దలూరు పరిసర ప్రాంతాలలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్న విషయాన్ని గుర్తించి ప్రభుత్వం ఈ అవకాశాన్ని ప్రజలకు కల్పించిందని ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులు వెంకటేశ్వర్లు-1, నాగభూషణ్ రెడ్డి- 2 విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సెయింట్ పాల్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చల్ల రమేష్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.